# రచయితలారా రక్షించండి!

"మీకోసం ఎవరో వచ్చారండీ" అని నా శ్రీమతి చెప్పేసరికి చదువుతున్న పేపరు మడిచి పక్కనబెట్టి విజిటర్స్ రూము వైపు నడిచాను.

విజిటర్స్ రూములో ఒక తల నెరిసిన పెద్దాయన, పాతికేళ్ల యువకుడు కూర్చుని వున్నారు.

నన్ను చూడగానే "నమస్కారం సార్" అంటూ లేచి నిలబడ్డాడు పెద్దాయన. యువకుడు చేతులు జోడించి నిలబడ్డాడు.

"ఇప్పుడు చెప్పండి" అన్నాను, నా శ్రీమతి పంపిన కాఫీలు ఇద్దరికీ ఇచ్చి.

పెద్దాయిన తన బట్టతల మీద చిన్నగా దురువు వేసుకుని, "నా పేరు వాలి అండీ. వీడు నాకొడుకు అంజనేయులు. మాది నెల్లూరండీ. ఆరు నెల్ల కిందట ఈ ఐదరాబాదులో సెటిలయినం. దేనికో తెలుసాండి" ఆగి ఊపిరి పీల్చుకొన్నాడు.

"ఏదైనా బిజినెస్ స్టార్ట్ చేసారా"

"అవునండీ, ఎయ్యిన్నర రూపాయల ఇల్లు అద్దెకు తీసుకున్నాం. ఆ ఇంటికి పోనుందండీ. అందులో ఓ గది ఎ.సి. చేయించామండీ"

"ఇంతకీ బిజినెస్ ఏమిటో చెప్పలేదు"

"అదేనండి కథలు, నవలలు రాసే బిజినెస్"

"మీరేం చేస్తుంటారు" అన్నాను ఆశ్చర్యంగా, అతనా కొత్తరకం బిజినెస్ సంగతి చెప్పిన తరువాత.

"మాకు నెల్లూరు దగ్గర యాభై ఎకరాల మాగాణీ భూమి ఉందండీ. అదంతా కౌలుకిచ్చి, ఫామిలీతో ఇటొచ్చేసానండి"

"అరరే ఎంత పని చేశారు" అన్నాను బాధపడుతూ.

"మంచి పనేచేశాను గదండీ. ఎండలో కూసోని కష్టం చేసే కంటే ఇది నయం గదండీ. నీడన పడుండి లచ్చలు సంపాదించొచ్చుగదా"

అతని ఆశకు నాకు చాలా బాధనిపించింది. సాహిత్యాన్ని వ్యాపారంతో పోల్చడం, లక్షలు సంపాదించాలనుకొని రావడం నాకు వింత అనిపించింది.

"ఇంతకీ బాబూ నీకథలు, నవలలు ఎన్ని ప్రచురణ అయ్యాయి" అనడిగాను, అతని గొప్పతనం తెలుసుకొందామని.

ఆ యువకుడు ఏదో చెప్పడానికి నోరు తెరిచాడు. ఇంతలో అతని తండ్రి అందుకొన్నాడు.

"ఇప్పుడే కదండీ మొదలుపెట్టింది. మా వాడీమద్దెన 'సముద్రంలో చేప పిల్లలు' అన్న ఎనిమిదొందల పేజీల నవల రాసేడండీ. మీరు ఆ నవలను ఆవిష్కరించి మా వాడికి సన్మానం చేయాలండీ" అన్నాడు రెండు చేతులెత్తి నమస్కరిస్తూ.

"మీవాడికి సన్మానం జరగడానికి ముందు నవల పబ్లిష్ కానివ్వండి. అది పబ్లిష్ అయిన తరువాత తలా ఒక కాపీ నగరంలో ఓ పదిమంది చేయి తిరిగిన రచయితలకు చదవమని ఇవ్వండి. తరువాత సన్మానం ఏర్పాటు చేస్తాం. అప్పుడు నవల ఆవిష్కరణ, మీ వాడికి సన్మానం ఒకేసారి జరుగుతాయి" అన్నాను అనునయంగా.

ముసలాయన చాలా ఆనందపడిపోయాడు. "శానా సంతోషమండీ. ఇయ్యాల్టి నుండి అదే పనిలో ఉంటా. ఎవ్వరూ ప్రింటు చేయకపోతే నానే ప్రింటు జేత్తా" అంటూ లేచి నిలుచున్నాడు వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతూ.

"తే... తే... తేక్సండీ" అన్నాడు ఆ యువకుడు ఒక్కో అక్షరాన్ని పళ్ళమధ్య నములుతూ. అప్పటికే చొంగ కారి, కింద కార్పెట్ అంతా తడిసిపోయింది. అప్పుడు అర్థం చేసుకున్నాను అతను నత్తి మూలంగా ఇంతసేపూ మాట్లాడలేదని.

"వస్తానండీ" అంటూ బయలుదేరిని పెద్దాయన పదడుగులు వేసి వెనక్కి తిరిగి వచ్చాడు.

నా దగ్గరకు వచ్చి అటూ ఇటూ చూసి "చెయ్యి తిరిగిన రచయితలంటే రాసిరాసీ చెయ్యి ఎనక్కి తిరిగిపోయినోళ్ళు గదండీ" అనడిగాడు చిన్నగా.

"అవునండీ, చెయ్యి ఎన్ని మెలికలు తిరిగితే అంత గొప్ప రచయిత అన్నమాట" ఇప్పటి వరకూ ఎలా ఉంటారో తెలియని నా తెలివితక్కువ తనం బటయపడకుండా జవాబిచ్చాను.

మళ్ళీ నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు పెద్దాయన.

ఆ రోజు రాత్రి చాలాసేపు తాలోచించాను. నాకా నిజానికి సాహిత్యం గురించి ఓనమాలు తెలియవు. కాకపోతే నేను కష్టపడి పుస్తకాలు చదువుతాను. పదిమందిని కూడవేసి ఇటువంటి సన్మాన సభలు నా ఖర్చుతో చేస్తాను. ప్రముఖ సాహితీ సంస్థలు తిరస్కరించిన ప్రతి రచయితా నా దగ్గరకొస్తారు ఆవిష్కరించమని. నేను ఇప్పటికి ఒక పుస్తకం రాసి ఎరుగను. చదివిందే అయిదవ తరగతి. అయితే నగరంలో ఏ గుర్తింపూ లేని అనామకుడిలా ఉండలేక ఇలా చేస్తే నాక్కొంత గుర్తింపు వస్తుందని నా ఆలోచన. అదీ నా ఆరాటం. ఈ

స్వలాభాపేక్షతో ఏదో ప్రింటు చేసిన పుస్తకం తెచ్చి నా ముఖాన పడేస్తే చాలు. అది ఎలుకల మీదే గావచ్చు. ఎలుగుబంట్ల మీదే కావచ్చు. సన్మానం చేయడమే నా పని.

కొన్ని నెలలు గడిచాయి. ఆ రోజు ఆంజనేయులు రచించిన 'సముద్రంలో చేప పిల్లలు' నవల ఆవిష్కరణ మహోత్సవం. నేను అధ్యక్షహోదాలో ఉన్నాను. స్టేజీ మీద చేయి తిరిగిన రచయితలు చాలామంది కూర్చొని వున్నారు.

అందరి రచయితల కుడిచేతులు రిసీవరు కుండే టెలిఫోను వైరులాగా ఎన్నో చుట్లు మెలికలు తిరిగి వున్నాయి. సహజత్వం కోసం ప్రేక్షకుల కెదురుగా వేదిక మీదున్న గాజు తొట్టిలో నీళ్ళు పోసి అందులో చేప పిల్లల్ని తెచ్చి వదిలాడు ఆంజనేయులు తండ్రి వాలి.

సన్మాన సభ చాలా ఆసక్తి కరంగా జరిగింది. ఆంజనేయులు రచనా వైశిష్ట్యం గురించి, నవలలోని ఉదాత్తమైన సన్నివేశాలు గురించి అందరూ మాట్లాడారు. ఆఖరుగా అధ్యక్షుడైన నన్ను మాట్లాడమన్నారు.

"పరబ్రహ్మం గారు మా వాడ్ని మీ చేతుల్లో పెట్టాను" అన్నట్లు ముందు ప్రేక్షకుల వరుసలో కూర్చొన్న వాలి నాకు చేతులెత్తి నమస్కారం చేశాడు.

నేను చుట్టూ ఒకసారి చూసి, అందరూ చేసినట్లు మైకు పట్టుకొని మెడ అటూఇటూ ఆడించి, మెడ కింద ఉన్న చొక్కా బొత్తాము ఒకసారి ఊడతీసి మరలా పెట్టుకొని రెండు పొడి దగ్గులు దగ్గాను. తరువాత 'ఉష్... ఉష్' మని ఊది మాట్లాడడం మొదలు పెట్టాను.

"వేదిక నలంకరించిన పెద్దలకు, సోదర మహాశయులకు నా అభినందనలు, ఇప్పుడు మన ఆంధ్రప్రదేశ్ వెలుగు అయిన ఆంజనేయులు రచన ఒక అద్భుతం. ఒకప్పుడు హనుమంతుడు తోకకు నిప్పు పెట్టుకుని లంకా దహనం కావించి రాక్షస సంహారం కావిస్తే, ఇప్పుడు మన ఆంజనేయులు తన సముద్రంలోని చేప పిల్లల్ని మన మీదికి వదిలి మన అజ్ఞానాన్ని తినమన్నాడు. ఈ నవల చదివిన ప్రతి ఒక్కరూ ఆంజనేయులు అంతటి విజ్ఞానవంతులు కాగలరు" అంటూ ఆంజనేయుల్ని చెడామడా పొగిడి వేదిక దిగాను.

నేను ఇలా కూర్చున్నానో లేదో మా సభా ప్రాంగణంలోకి కొన్ని వందల మంది నల్లబాడ్జీలు ధరించిన వాళ్ళు వచ్చారు. వాళ్ళందరూ ఏవో కొన్ని వ్యాఖ్యలు రాసిన అట్టలుపట్టుకొని ఉన్నారు. "రచయితలారా రక్షించండి" అని, మరికొన్నిటి మీద "రచయితలు డౌన్, డౌన్" అని, ఇంకొందరు "అసోసియేషన్ ఆఫ్ నేమ్స్ జిందాబాద్" అని రాసి వున్నాయి. వచ్చిన వాళ్ళంతా చాలా బలవంతులు. కూర్చొని ఉన్న ఆహ్వానితుల్ని గెంటి ఆ సీట్లలో వీళ్లు కూర్చున్నారు.

భయంతో మిగతా రచయితలతో బాటు నేనూ నిలబడ్డాను. అంజనేయులైతే సరేసరి. భయంతో గడగడా వణికిపోతున్నాడు.

నాకేం అర్థం కాలేదు. 'ఏమిటీ అసోసియేషన్' అనుకొంటూ, వేదిక ఎక్కి నాకెదురుగా నిలబడి ఉన్న వ్యక్తిని అడిగాను.

"మీరెవరు? ఏమిటిదంతా?" అన్నాను. "రచయితలూ డౌన్‌డౌన్" అంటూ అరిచాడతను. మిగతా వాళ్ళంతా "డౌన్ డౌన్" అంటూ అరిచారు.

"ఎవరయ్యా అంటే చెప్పరేంటి" ఈ సారి గట్టిగా అడిగాను.

"మేము 'అసోసియేషన్ ఆఫ్ నేమ్స్' కు సంబంధించిన వాళ్ళం. నేను అసోసియేషన్ ప్రెసిడెంటుని. కిందనిలబడి ఉన్న ఇద్దరిలో ఒకాయన సెక్రటరీ, ఇంకొకాయన కోశాధికారి" అన్నాడు.

"నగరంలో ఇలాంటి అసోసియేషన్ ఒకటుందని మేం ఎప్పుడూ వినలేదు. చాలా విచిత్రంగా వుందే"

"ఇంకా విచిత్రమయిన సంగతొకటి వినండి. మాసంఘంలోని వ్యక్తులకు ఉన్న పేరు ఇంకొకరికుండకూడదు. మాకు ఆకారం కాదు ముఖ్యం పేరు. మాకు పేరుకు తగ్గ రూపముంది. నాపేరు ధర్మరాజు, మా సెక్రటరీ పేరు కృష్ణుడు, కోశాధికారి పేరు భీముడు" అన్నాడు వాళ్ళను పరిచయం చేసి.

ధర్మరాజు ప్రశాంతమయిన వదనంతో, చూడగానే పెద్దమనిషి అనిపించేలా వున్నాడు. కృష్ణుడు అటు లావుగాక, ఇటు సన్నమూ గాక, అటు పొడవూ గాక, ఇటు పొట్టిగాక మధ్యస్తంగా వున్నాడు. ఛామనఛాయలో వున్నాడు. చూడగానే ఆకర్షించే ముఖం, కళ్ళు చిలిపిగా నవ్వుతున్నాయి. ఇకపోతే భీముడు, నల్లగళ్ళ టెరీకాటన్ షర్ట్ క్రింద ఎర్రని మెలితిరిగిన కండలున్నాయి. టైట్‌గా వేసిన పాంటు మరుగున ఉక్కు స్తంభాల్లాంటి కాళ్ళున్నాయి. లావు మీసాలతో ముఖం గంభీరంగా ఉంది.

"అయితే మీరు పురాణపురుషులా" అనడిగాను.

"అట్లా అనేం కాదు. మేము వ్యక్తులు పెట్టుకునే పేర్లం మాత్రమే. ఒక్కో పేరుకు ఒక్కో ప్రత్యేకత వుంటుంది. ధర్మరాజు పేరు వినగానే ధర్మం, భీముడు పేరు వినగానే శౌర్యం, అర్జునుడు పేరు వినగాను న్యాయం, కర్ణుడి పేరు వినగానే దానం, రాముడి పేరు వినగానే భక్తి, కృష్ణుడు పేరు వినగానే రక్తి గుర్తుకు రావాలి. అదే మా అసోసియేషన్ ఆశయం" అన్నాడు ధర్మరాజు అనబడే వ్యక్తి.

"అయితే ఇప్పుడేమంటారు" అన్నాను అర్థంగాక.

"అది చెప్పడానికి మేమంతా కట్టగట్టుకుని వచ్చింది. మా పేర్లకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటడానికే ఇలా వచ్చాం. మొన్నటికి మొన్న ఆంధ్రుల ఆరాధ్య రచయిత 'పిచికేశ్వరావు' రాసిన 'గూట్లో గులాబి ముళ్ళు' నవల్లో ఒక పల్లెటూరులో వాళ్ళకి, వీళ్ళకి గాదాపెట్టి ఆనందించే పెద్దమనిషిగా సృష్టించాడునన్ను. నేనిలాంటివి ఎప్పుడన్నా ఎరుగుదునా. శని 'పెన్' నేముతో సీరియల్ నవలలు రాసే రచయిత తన 'పేరులేని పెళ్ళికొడుకు' సీరియల్ నవల్లో పెళ్ళికొడుకు కుంటి తమ్ముడిగా సృష్టిస్తాడా. ఏం పెళ్ళికొడుకు తండ్రిగానో, ఎట్‌లీస్ట్ పెళ్ళి చేసే పురోహితుడు గానో వేయించగూడదా" అన్నాడు బాధగా ధర్మరాజు.

ఇంతలో వడివడిగా వేదిక ఎక్కిన కృష్ణుడు, ధర్మరాజు ముందున్న మైకు తనవైపు జరుపుకుని 'నాపేరు కృష్ణుడు. నా పేరులోంచి రకరకాల పేర్లు పుట్టాయి. కృష్ణ, కృష్ణారావ్, కృష్ణకాంత్, గోపీకృష్ణ, గోవర్ధన కృష్ణ ఇలా రకరకాలుగా నా పేర్లు రచయితలు వాడుకొంటున్నారు. ఐ హావ్ నో అబ్జెక్షన్ కాని 'శంకలేశ్వరరావు' వ్రాసిన "శంఖులో పోస్తేనే తీర్థం" డైరెక్టు నవల్లో నన్ను ఆజన్మ బ్రహ్మచారిగా సృష్టించాడు. ఎప్పుడు నా అష్టభార్యలేకాక పదహారువేల మంది గోపికలతో సయ్యాటలాడే నేను ఆ పాత్రలో ఎంత నలిగిపోయాను. చేతులు కట్టిపడేసిన ఆ రచయితను తిట్టుకుంటూ ఎంత విరహవేదనను అనుభవించానో ఎవరికి చెప్పుకోను" తన బాధనంతా వెళ్ళగక్కాడు కృష్ణుడు.

"బావా నువ్వటు తప్పుకో" అంటూ హుంకరిస్తూ, వేదికె ఎక్కాడు భీముడు. అతను నడుస్తుంటే వేదిక అటూ ఇటూ కదలసాగింది.

"అయ్యా వినండి. నాపేరు భీముడు. నన్ను భీమారావ్, భీమకుమార్ అనే రకరకాల మోడరన్ పేర్లతో రచయితలు నన్ను పుస్తకాల్లో ఎక్కించారు. ఆఫ్‌కోర్స్ నాకలాంటి పేర్లంటే ఇష్టమనుకో. మొన్నీమధ్య డాక్టర్ కుక్కుటేశ్వరావు రచించిన 'వంటగదిలో వంటరివాడు' సప్లిమెంటు నవల్లో నేను భీమరాజుగా కట్టాను. అందులో నేను ఉద్యోగం లేక వంట ఇంటి చార్జి తీసుకొంటాను. అంతేగాక అడపాదడపా పెళ్లాం చేతుల్లో అప్పడాల కర్ర దెబ్బలు తింటూ ఎప్పుడూ మూడు బుడిపెలకు బొలన్ను తగ్గకుండా నెత్తిన పెట్టుకుని తిరుగుతుంటాను. ఒకసారి వంట గదిలో ఎలుక దూరితే దాన్నిచూసి, పరుగెత్తబోయి తలుపు తలకు కొట్టుకుని వారం రోజుల పాటు స్పృహతప్పి పడిపోయాను. చూడండి ఎంత అన్యాయమో? నేనెక్కడ నాబలమెక్కడా" కండలు పొంగిస్తూ, తెగ బాధపడిపోయాడు భీముడు.

ఆ వెంటనే కర్ణుడు వచ్చి "నేనెవర్ని? పుట్టుకతోనే కవచకుండలాలతో పుట్టి దానకర్ణుడిగా పేరు పొందాను. అలాంటి నన్ను మీ రచయిత 'ఆడుక్కునే అర్భకుడు' అనే

కథలో నేను రొట్టెముక్క ఒక అనామకుడి దగ్గర యాచించేటట్లు చేస్తాడు. నా మనసుకు వ్యతిరేకంగా ఆ పని చేయించడానికి ఎంత బాధపడి వుంటానో ఆలోచించండి" అన్నాడు దుఖఃంగా.

ఇంతలో అతన్ని అనుసరించే వేదిక ఎక్కిన సుయోధనుడు "తెలుసుగా! నేను బతికనన్నాళ్ళు ఎంత గొప్పగా బతికానో, అలాంటి నన్ను "పిశాచరావు" అనబడే రచయిత 'కలలో కన్నీళ్ళు' అనే కథలో నన్ను చింపిరి వస్త్రాలతో ఎర్రటి ఎండలో చెప్పులు లేకుండా తారు రోడ్డుమీద సమితి ఆఫీసు నుండి మండల ఆఫీసుకు కులం సర్టిఫికేటు కోసం నడిపిస్తాడా! ఇదెక్కడి న్యాయం" అన్నాడు ఆవేశంగా.

ఇంతలో ఒక స్త్రీ వేదిక ఎక్కింది. అందంగా పొడవుగా వుంది. ముఖాన కుంకుబొట్టు చూడగానే మంచి అభిప్రాయం గలిగించేటట్లుంది.

"అయ్యా నేను ఎంతో పవిత్రంగా బతికాను. పాతివ్రత్యమే పరమావధిగా భావించి యమధర్మ రాజుతో పోరాడి భర్త ప్రాణాలు తిరిగి తెచ్చుకొన్న సావిత్రిని. అలాంటి నన్ను మెల్లకంటి వెంకాయమ్మ అనే రచయిత్రి రాసిన 'నగరంలో సావిత్రి' అనే నవల్లో నన్ను కులటగా సృష్టించింది. చూడండి ఘోరం" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది. తరువాత సుశీల, అహల్య ఇలా ఎంతోమంది వచ్చి తమ బాధలను చెప్పుకొన్నారు.

"ఇంతకీ ఏమిటండీ మీరు చెప్పేది. నాకేమీ అర్థమయి చావట్లేదు" అన్నాను, వాళ్ళ నాయకుడు ధర్మరాజు వైపు చూస్తూ.

"అవునండీ మీకు ఏమీ అర్థం కాదు. కొంతకాలానికి మీకు మీరు అర్థంగాక 'ఇంతకీ నేనెవర్ని' అని లేబరేటరీలో కూర్చొని ప్రయోగాలు చేసుకునే రోజు వస్తుంది" అన్నాడు భీముడు ఆవేశంగా.

నాకు కొంత అర్థమయి "మీ పేర్లను రకరకాల పాత్రలకు మా రచయితలు వాడుకొంటున్నారనేగా మీరు చెప్పేది. ఇక అలాంటిది జరగకుండా చూస్తాను. కొత్త పేర్లు వెతుక్కుంటాం" అన్నాడు.

"అవునండీ వెతుక్కుంటారు. కొంత కాలానికి 'ఎ-ఒన్,' 'ఎ-టు', అని 'బి-ఒన్', 'బి-టు' అని పెట్టుకుంటారు. ఇంకా కొంత కాలనికి బస్సులకు, స్కూటర్లకి పెట్టుకొన్నట్లుగా ఎ.పి.యస్., ఎ.పి.జడ్., అని నంబర్లతో పెట్టుకొంటారు. కాని అది ఇప్పుడు కాదు. ఇరవై ఒకటవ శతాబ్దంలో. కానీ ఈ లోపల మా పని" అన్నాడు అర్జునుడు.

"ఏం చెయ్యమంటారు"

"ఏం చేసేదేముంది, మా పేర్ల పవిత్రతను కాపాడుమంటున్నాం. వ్యక్తి ప్రవర్తన బట్టి పేర్లు పెట్టమంటున్నాం. ఇదే మేమురచయితలను కోరేది"

"పాపం రచయితలేం చేస్తారు. ప్రస్తుతం దేశంలో అలాంటి పేర్లుగల వ్యక్తుల ప్రవర్తనను బట్టి తమ రచనల్లోనూ పెడుతున్నారు"

"అయితే నవలల్లో ఆ విధంగా రావడానికి వీల్లేదు" అంటూ వాళ్ళు గొడవ చేయడం మొదలు పెట్టారు.

చివరకు ఎలాగయితే నేం, రచయితలతో సంప్రదించి అలా జరగకుండా వాళ్లను ఒప్పించాను. "రచయితలూ జిందాబాద్" అంటూ నిమిషాల్లో అదృశ్యమైపోయారు అసోసియేషన్ ఆఫ్ నేమ్స్ సభ్యులు, వాళ్ల నాయకులతో సహా.

"ఏమండోయ్ లేవండి" అంటూ నా శ్రీమతి అరిచే సరికి మెలకువ వచ్చింది.

"మీది రోజు రోజుకీ మొద్దు నిద్ర అవుతోంది. అలారం కూడా వినిపించలేదా. ఈ రోజు పెందలాడ్నే వెళ్ళి అంజనేయులు సన్మానానికి ఏర్పాట్లు చేయాలన్నారు" అంది.

అప్పటికి అర్థమయింది నాకు ఇప్పటి వరకు జరిగిన ఆంజనేయులు సన్మానం కలన్నమాట. అసలైన సన్మానం ఈ రోజు జరగాలన్నమాట.

అయితే నాలో అంతరంగ మధనం మొదలైంది. 'రచయితలారా రక్షించండి' అని పేర్లన్నీ వచ్చి వేడుకొన్న సంఘటన ఎంత బాధాకరమైనది. నిజంగా సమాజంలోని పేర్లెందుకువచ్చాయి. ఒకరినొకరు గుర్తించుకొనేందుకు. మానవుడు గతంలో నగ్నంగా తిరుగుతూ, జంతువుల్ని చీల్చుకుని పచ్చిమాంసం తినేవాడు. నిప్పు అంటే తెలియదు. మాట్లాడడమే చేతకాక ఒకరినొకరు జంతువుల కూతలను అనుకరిస్తూ 'ఓ' అని పిలుచుకొనే వారు. అప్పుడు జనాభా అతి తక్కువుగా వున్నందున పెద్ద ఇబ్బందిగా ఉండేది కాదు.

క్రమేణా జనాభా పెరిగింది. నాగరికతలో మార్పులు వచ్చాయి. వేదాలు, ఇతిహాసాలు పుట్టాయి. ఈ పరిస్థితిలో ఒకర్ని ఒకరు గుర్తించుకొని పిలచుకోవడానికి పేర్లు అవసరమయ్యాయి. ఆ పేర్లు పురాణ గ్రంధాల్లోంచి తీసుకొన్నారు. క్రమేణా సమాజంలో కొత్త పేర్లు వచ్చాయి. మంచి పనులు చేసే ప్రతి ఒక్కరి పేర్లకూ ప్రాముఖ్యత వచ్చింది.

కాలం జరజరా జరిగిపోయింది. సమాజంలో కట్టుబాట్లు తెగిపోయాయి. నాగరికత వేలంవెర్రి వేసింది. ఈనాడు గాంధీ అనిపేరున్న వాడు ఎప్పుడూ బ్రాందీతోనే గడుపుతాడు. అలాగే రాముడు ఒకప్పుడు బుద్ధిమంతుడు. ఇప్పుడు ఆ పేరుగల వాడు దొంగతనాలు చేస్తున్నాడు.

అందుకే మనిషి పుట్టగానే పేరు అవసరంలేదని నాఉద్దేశం. పదేళ్ళ వయసు వచ్చేంత వరకూ ఎక్స్, వై, జెడ్ మొదలైన పేర్లతో వ్యవహరించి తరువాత వారి వారి అలవాట్లనుబట్టి భారతీయ సంస్కృతి పవిత్రత చెడకుండా రాముడో, కృష్ణుడో, నరకాసురుడో అని పేర్లు పెట్టడం అవసరం.

ఇప్పుడు నాకళ్లు తెరుచుకున్నాయి. నా స్వార్ధం కోసం, కీర్తి కోసం, సాహిత్యంలో ఓనమాలు రాని రచయితలను సన్మానించి సమాజం మీదికి తరుమదలుచుకోలేదు. ఎందుకంటే సత్తావున్న రచయితల్ని ప్రముఖ పత్రికలు, ప్రముఖ సాహితీ సంస్థలు ఎలాగూ పైకి తెస్తూనే వున్నాయి. అలాంటప్పుడు ఏ సాహితీ సంస్థలోనూ కనీసం సభ్యుడను కూడా కాని నేను సన్మానాలు చేయడం హాస్యాస్పదం.

అందుకే, ఇప్పుడు నేను ఎవరికీ సన్మానాలు చేయడం లేదు. ఎక్కడయినా సన్మానాలు జరుగుతుంటే ప్రేక్షకుడిగా ఒకమూల కూర్చుని ఆనందిస్తున్నాను ✸

**(ఈనాడు ఆదివారం, తేది 8-8-1993)**